
సాక్షి
గుంటూరు
శుక్రవారం। 20 । సెప్టెంబర్ । 2024



కార్తికేయుడి సేవలో పీఆర్కే

మోపిదేవి: శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారిని వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు, మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి గురువారం దర్శించుకున్నారు.




8,004 క్యూసెక్కులు విడుదల

తాడేపల్లి రూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద గురువారం 8,004, హై లెవల్ కాలువకు 330, బ్యాంక్ కెనాల్‌కు 1,807 క్యూసెక్కులు విడుదల చేశారు.



పులిచింతలలో 45 టీఎంసీలు

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టులో గురువారం నీటి నిల్వ 45 టీఎంసీలకు చేరింది. ఎగువ నుంచి 29,850 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. దిగువకు 16,000 క్యూసెక్కులు వదులుతున్నారు.



100% పగ.. దగా!

వంద రోజుల పాలనలో దౌర్జన్యాలు, ప్రతీకారాలకే ప్రభుత్వం ప్రాధాన్యం

రెడ్‌బుక్ రాజ్యాంగం అమలుపైనే దృష్టి.. హామీల అమలులో ప్రజలను మోసగించిన సర్కారు

ప్రజా సంక్షేమం మాటలకే పరిమితం.. ప్రతిపక్షంపై మాత్రం నిత్యం విషం చిమ్మడమే. ఇదిగో అంటే కేసు.. అదిగో అంటే అరెస్టు.. వైఎస్సార్ సీపీ శ్రేణులే లక్ష్యంగా పాలకుల ప్రతీకార చర్యల తీరిది. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రెడ్ బుక్ రాజ్యాంగం అమలు. ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలను నిత్యం వేధించడమే వారి పని. వీలైనంతగా దోచుకోవడానికే ప్రణాళికలు. ఎన్నికల సమయంలో ఎన్నో హామీలు.. అన్నీ మాటలకే నేడు పరిమితం. వంద రోజుల పాలనలో విపక్ష నాయకులు, కార్యకర్తలపై వంద శాతం పగ తీర్చుకున్నారు. హామీలపై ప్రజలను దగా చేశారు.

- వైఎస్సార్ సీపీ శ్రేణులపై నిత్యం వేధింపులే లక్ష్యం
- ఎన్నికలకు ముందు నోటికొచ్చినట్లు ఎన్నో హామీలు
- నేడు అమలుకు కనీస చర్యలు చేపట్టని చంద్రబాబు
- కూటమి వంద రోజుల పాలనపై జనం మండిపాటు



టీడీపీ కార్యకర్తల దాడిలో ధ్వంసమైన బృందావన్ గార్డెన్స్‌లో ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి కార్యాలయం (ఫైల్)

సాక్షి ప్రతినిధి, గుంటూరు : దాడులు, దౌర్జన్యాలు, అరెస్టులు, రెడ్ బుక్ రాజ్యాంగం అమలు.... కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలన తీరిది. ఇచ్చిన హామీల అమలుపై దృష్టి పెడితే ఒట్టు. వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలను వేధించడమే లక్ష్యంగా పాలకులు వ్యవహరించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక.. ఎప్పుడో మూడున్నరేళ్ల క్రితం జరిగిన తెలుగుదేశం పార్టీ కార్యాలయంపై దాడి, అప్పటి ఎంపీ రఘురామకృష్ణంరాజు అరెస్టుపై చేసిన ఫిర్యాదులే పాలకులకు కీలకం అయ్యాయి. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, అప్పటి ఇంటెలిజెన్స్ చీఫ్ పీఎస్ఆర్ ఆంజనేయులు, సీఐడీ చీఫ్ సునీల్‌కుమార్‌తోపాటు పలువురు అధికారులను ఇబ్బంది పెట్టడమే ప్రభుత్వ లక్ష్యంగా మారింది. ఇక ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, తలశిల రఘురామ్, మాజీ మంత్రి జోగి రమేష్, మాజీ ఎంపీ నందిగం సురేష్ సహా వందల మంది నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి వేధించడమే పనిగా పెట్టుకున్నారు. ఇప్పటికీ మాజీ ఎంపీ నందిగం సురేష్ జైలులోనే ఉన్నారు.

మంత్రి లోకేశ్ తీరూ అదే..

అధికారంలోకి వచ్చాక మంగళగిరిలో రెండేళ్ల లోపు ఇరిగేషన్, కొండ పోరంబోకు, ఫారెస్ట్, చెరువులు, ఇతర ప్రాంతాల్లో నివాసం ఉండే వారికి పట్టాలు ఇస్తామని లోకేశ్ హామీ ఇచ్చారు. ఆ దిశగా చర్యలు లేవు. ఫారెస్ట్ ప్రాంతంలో రోడ్లు వేయిస్తానన్నారు. ఇటీవల వర్షాలకు కొట్టుకుపోయిన చోట్ల కూడా రహదారులకు కనీసం మరమ్మతులు చేయించలేదు.

నాడు బాబు బూటకపు మాటలు..

ఎన్నికల సమయంలో చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్, లోకేశ్‌లు జిల్లాలో పర్యటించారు. ఆ సమయంలో పలు హామీలు ఇచ్చారు. అవి ఇప్పటి వరకు అమలుకు నోచుకోలేదు.

- గుంటూరులో భూగర్భ డ్రైనేజీ పనులు పూర్తి చేస్తామని చెప్పారు. ఇప్పటివరకూ దీనిపై చంద్రబాబు నాయుడు సమీక్ష చేసిన పాపాన పోలేదు. ''రాజధాని అమరావతిలో గుంటూరు భాగం. హైదరాబాద్, సికింద్రాబాద్‌లకు తోడుగా సైబరాబాద్‌ను నిర్మించి ఒక మహానగరానికి శ్రీకారం చుట్టాను. హైదరాబాద్ ఔటర్ రింగురోడ్డు 163 కి.మీ. మాత్రమే. కానీ, అమరావతి ఓఆర్ఆర్ 180 కి.మీ.తో ఏర్పాటు చేస్తానని'' ఆయన చేసిన ప్రకటనలు నేటికీ మాటలకే పరిమితం అయ్యాయి.
- గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ముస్లింలు ఎక్కువ. ఇక్కడి వారికీ ఏవేవో చేస్తామని ప్రకటించారు. ''ముస్లింలకు 50 ఏళ్లకే పింఛన్ ఇస్తా. ముఖ్య పట్టణాల్లో ఈద్గాలకు, ఖబరస్తాన్‌లకు స్థలాలు కేటాయిస్తాం. హజ్ యాత్రకు రూ.లక్ష సాయం చేస్తాం. నూర్‌బాషా కార్పొరేషన్ పెట్టి ఏడాదికి రూ.వంద కోట్లు ఇస్తాం. మైనారిటీ, ఫైనాన్స్ కార్పొరేషన్ల ద్వారా రూ.5 లక్షల వరకు వడ్డీలేని రుణాలు ఇచ్చే బాధ్యత నాది. ఇమామ్, మౌజంలకు రూ. 10 వేలు, రూ.5 వేల చొప్పున గౌరవ వేతనం అందిస్తాం. అర్హత ఉన్న ఇమామ్‌లను ప్రభుత్వ ఖాజీలుగా నియమిస్తాం. మసీదుల నిర్వహణ కోసం ప్రతి నెల రూ. 5 వేలు ఇస్తాం..'' ఇలా పలు హామీలు ఇచ్చారు. ఈ దిశగా ఒక్క అడుగు కూడా ఇప్పటికీ పడలేదు.
- ''గుంటూరులోని ప్రతి ఇంటికి పట్టా ఇస్తాం. ఇంటి జాగా లేని వారికి స్థలం కేటాయిస్తాం. టిడ్కో ఇళ్లను పూర్తి చేసి ఉచితంగా లబ్ధిదారులకు ఇస్తాం. కూటమి ప్రభుత్వం రాగానే గ్రామాల నుంచి మండల హెడ్ క్వార్టర్‌కు, మండలం నుంచి జిల్లా కేంద్రాలకు మళ్లీ పూర్తిగా రోడ్లు వేసే బాధ్యత నాది'' అని చంద్రబాబు చెప్పారు. ఇప్పటి వరకూ ఒక్క రోడ్డుపైనా తట్టెడు మట్టి కూడా వేయలేదు.
- ''గుంటూరులోనే ఐటీ టవర్లు కట్టి వర్క్ ఫ్రం హోం విధానం తీసుకొస్తాం. తాడికొండ ప్రధాన రహదారి విస్తరణలో ఇళ్లు కోల్పోయిన బాధితులకు పరిహారం అందిస్తాం. నియోజకవర్గంలో ప్రధానమైన తాగునీటి సమస్యని పరిష్కరించి, ఇంటింటికీ తాగునీరు అందిస్తాం. తాడికొండ కొండపై ఉన్న కొండ మల్లికార్జున స్వామి ఆలయానికి ప్రస్తుతం ఉన్న ఘాట్ రోడ్డును సిమెంట్ రోడ్డుగా మారుస్తాం.'' అని చంద్రబాబు అన్నారు. ఆచరణలో మాత్రం వీటిలో ఏ ఒక్కటీ అమలు కాలేదు.



గుంటూరులోని చంద్రమౌళినగర్‌లో టీడీపీ కార్యకర్తలు ధ్వంసం చేసిన అప్పటి మంత్రి విడదల రజిని కార్యాలయం (ఫైల్)

ఇవిగో నిదర్శనాలు

- మంగళగిరి నియోజవర్గంలోని దుగ్గిరాల మండలంలో వైఎస్సార్ సీపీ కార్యకర్త ఇంటిపైకి దాడికి వెళ్లిన సమయంలో జరిగిన ఘర్షణలో ఒక తెలుగుదేశం కార్యకర్త మృతి చెందితే, అసలు సంబంధం లేని ఎనిమిది మందిపై హత్య కేసు నమోదు చేశారు.
- మంగళగిరి మండలం నిడమర్రు గ్రామంలో కొట్లాట జరిగితే 15 మందిపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు.
- చంద్రబాబు నాయుడు, లోకేశ్‌ను సోషల్ మీడియాలో విమర్శించిన ఒక దళిత వ్యక్తిపై భౌతిక దాడి చేయడంతోపాటు నాయకుల కాళ్లు కూడా పట్టించారు.
- ఎర్రబాలెంలో ఎట్టికాపరి ఒకరు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహం ఏర్పాటు చేశారని దాడికి తెగబడ్డారు. శ్మశానానికి తాళాలు వేశారు.
- గుంటూరులో మాజీ మంత్రి రజిని, ఎమ్మెల్సీ అప్పిరెడ్డి కార్యాలయాలపై టీడీపీ కార్యకర్తలు దాడి చేసి విధ్వంసం సృష్టించారు. నిందితులకు నోటీసులు ఇచ్చి పాలకులు చేతులు దులుపుకొన్నారు.
- గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో టీడీపీ ఎమ్మెల్యే గళ్లా మాధవి భర్త రామచంద్రరావు షాడో ఎమ్మెల్యేగా చక్రం తిప్పుతున్నారు. తన పుట్టిన రోజుకు పొలం గిఫ్టుగా ఇవ్వాలంటూ తన సామాజిక వర్గానికి చెందిన వారిపైనే దాడి చేయించారు. తిరిగి వారిపైనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయించారు.
- ప్రత్తిపాడు నియోజకవర్గంలో కంకర, గ్రావెల్, రేషన్ బియ్యం.. ఇలా ఏదీ వదలకుండా ఒక్కోదానికి ఒక్కో ధరను అధికార పార్టీ వారు నిర్ణయించారు.
- మంగళగిరి నియోజకవర్గంలో మంత్రి నారా లోకేశ్ నివాసం ఉంటున్నప్పటికీ ఇక్కడి పార్టీ వ్యవహారాలు, ఇతర ప్రభుత్వ కార్యకలాపాలు పీఏల ద్వారా చక్కబెడుతున్నారు. పోలీసు స్టేషన్‌లో అడ్డగోలు కేసులు పెడుతున్నారు. ఇలా పెట్టే సమయంలో లోకేశ్ కార్యాలయం నుంచి ముందే ఫోన్ చేయించుకుంటున్నారు.



బాపట్ల మాజీ ఎంపీ నందిగం సురేష్‌ను అరెస్టు చేసిన పోలీసులు (ఫైల్)

న్యూస్‌రీల్

ఇది ప్రజలను ముంచిన ప్రభుత్వం



సత్తెనపల్లి: 'ఇది మంచి ప్రభుత్వం కాదు ... ప్రజలను ముంచిన ప్రభుత్వం' అని రాష్ట్ర మాజీ మంత్రి అంబటి రాంబాబు గురువారం ట్వీట్ చేశారు. ఎమ్మెల్యేలు ఇంటింటికీ వెళ్లేలా కార్యచరణ రూపొందించి 100 రోజుల పాలనపై 'ఇది మంచి ప్రభుత్వం' పేరుతో టీడీపీ ప్రజల్లోకి వెళ్లనుంది. దీనిపై మాజీ మంత్రి అంబటి రాంబాబు ఎక్స్‌లో స్పందించారు. ''మాది మంచి ప్రభుత్వం అని వారం రోజులు సంబరాలు చేస్తాం అంటున్నారు.. ఎలా మీది మంచి ప్రభుత్వం? నీకు రూ.15 వేలు, నీకు రూ. 15 వేలు అని చెప్పి ఇవ్వకుండా మోసం చేసినందుకా మీది మంచి ప్రభుత్వం?'' అని ప్రశ్నించారు. ప్రజలు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పోయింది, మేం హాయిగా ఉన్నాం అని అనుకోవట్లేదు ... వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ఎందుకు దించేశామా అని పశ్చాత్తాప పడేలా కూటమి వంద రోజుల పాలన ఉందన్నారు. నాణ్యమైన మద్యం ఇస్తాం.. తాగండి అంటూ నారా వారి సారా పాలన అనేలా రాష్ట్రంలో పరిస్థితి ఉందని విమర్శించారు.

చుక్కల భూముల పునఃపరిశీలన



పెదకూరపాడు: నియోజకవర్గంలో ఫ్రీ హోల్డ్ చేసిన చుక్కల, అసైన్డ్ భూముల వివరాలను స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ ఆర్.కుమోదినీ సింగ్ గురువారం రీ వెరిఫికేషన్ నిర్వహించారు. వెంట డివిజనల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే శ్రీనివాసరావు, సబ్ రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు, పెదకూరపాడు తహసీల్దార్ దానియేలు, శ్రీనివాసరావులు ఉన్నారు.

సాగర్ నీటిమట్టం



విజయపురి సౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 589.70 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 2,236, ఎడమ కాలువకు 4,613, ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 28,866, ఎస్ఎల్‌బీసీకి 1,800, వరద కాలువకు 600 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్‌కు 38,115 క్యూసెక్కులు వచ్చి చేరటంతో అంతే నీటిని విడుదల చేస్తున్నారు.

24 వరకు ఎన్ఎంఎంఎస్ దరఖాస్తు గడువు

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం అందించనున్న జాతీయ ప్రతిభా ఉపకార వేతన (ఎన్ఎంఎంఎస్) పరీక్షకు దరఖాస్తు చేసుకునేందుకు గడువు ఈనెల 24న ముగియనుందని జిల్లా విద్యా శాఖాధికారి పి.శైలజ గురువారం తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్, ఎయిడెడ్ పాఠశాలల్లో విద్యార్థులు పరీక్ష రాసేందుకు అర్హులని ఆమె పేర్కొన్నారు. పరీక్షలో ప్రతిభ చూపిన వారికి 9,10,11,12వ తరగతుల్లో ఏడాదికి రూ.12వేలు చొప్పున వారి బ్యాంకు ఖాతాల్లో జమ అవుతుందని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు శ్రద్ధ తీసుకుని విద్యార్థులతో దరఖాస్తు చేయించాలని ఆమె సూచించారు.

ఆశా కార్యకర్తలతో డీఎంహెచ్ఓ సమావేశం



గుంటూరు మెడికల్: గుంటూరు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో గురువారం డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి అధ్యక్షతన ఆశా కార్యకర్తల సమావేశం జరిగింది. కమిషనర్ ఆఫ్ హెల్త్, మెడికల్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ఆదేశాల ప్రకారం ప్రతి 3 నెలలకు ఒకసారి ఆశా కార్యకర్తలతో డీఎంహెచ్ఓలు సమావేశం నిర్వహించాలి. ఆ మేరకు ఏర్పాటైన సమావేశంలో వారి సమస్యలపై 12 అర్జీలను స్వీకరించారు. తన పరిధిలోని వాటిని పరిష్కరిస్తానని, మిగతావి ఉన్నతాధికారులకు పంపుతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రియాంక, చంద్రశేఖర్, సురేష్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ధూళిపాళ్ల ఆరోపణలు నిరాధారం

గ్రీన్ గ్రేస్ ప్రాజెక్టు సీఈఓ అంబటి మురళీకృష్ణ



పొన్నూరు: గ్రీన్ గ్రేస్ ప్రాజెక్టుపై ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ చేస్తున్న ఆరోపణలు నిరాధారమైనవని, ఆయనకు సంబంధం లేని విషయాలపై కూడా ఆరోపణలు చేస్తున్నారని గుంటూరులోని గ్రీన్ గ్రేస్ ప్రాజెక్టు సీఈఓ అంబటి మురళీకృష్ణ స్పష్టం చేశారు. ఈ మేరకు గురువారం పత్రిక ప్రకటన విడుదల చేశారు. గుంటూరు నగర ప్రజలకు, గ్రీన్‌గ్రేస్ కస్టమర్లకు ప్రాజెక్టుకు సంబంధించిన విషయాలను తెలియజేయవలసిన బాధ్యత తనపై ఉన్నందున ఈ ప్రకటన విడుదల చేసినట్టు అందులో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, రెరా, రైల్వే శాఖల నియమ, నిబంధనలకు లోబడి ప్రాజెక్టు నిర్మాణం చేస్తున్నామన్నారు. ప్రాజెక్టు ప్రారంభం నుంచి మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు తనిఖీలు చేస్తున్నారని పేర్కొన్నారు. దీనిలో భాగంగానే ఈ నెల 18న కూడా తనిఖీ చేయడం జరిగిందన్నారు. సంబంధిత అధికారులు లిఖిత పూర్వకమైన అంశాలు ఇచ్చినప్పుడు మాత్రమే తమ సంస్థ స్పందిస్తుందని వివరించారు. అయితే అప్పటి వరకు నగర ప్రజలు, ప్రాజెక్టు కస్టమర్లకు ఉన్న సందేహాలను నివృత్తి చేసే క్రమంలో ఈ ప్రకటన విడుదల చేసినట్లు అంబటి మురళీకృష్ణ మరోమారు స్పష్టం చేశారు. ఇక పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర మాట్లాడిన ప్రతి అంశంపై త్వరలోనే పూర్తి స్థాయిలో స్పందిస్తామని పేర్కొన్నారు.

గడువులోగా ప్రణాళికలపై నివేదికల సమర్పణ

జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి



లక్ష్మీపురం: స్వర్ణాంధ్ర 2047 విజన్‌కు సంబంధించి జిల్లా, మండల కార్యాచరణ ప్రణాళికల నివేదికలను రూపొందించి నిర్దేశిత గడువులోపు సమర్పించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గుంటూరు కలెక్టరేట్‌లోని వీసీ సమావేశ మందిరం నుంచి జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ఇతర అధికారులు పాల్గొన్నారు. సీఎస్ మాట్లాడుతూ.. ఏడాదికి 15 శాతం వృద్ధి రేటు లక్ష్యంగా విజన్ ప్రణాళికలను రూపొందించాల్సి ఉంటుందన్నారు. ఈ నెల 21 నుంచి ప్రజల సూచనలు, సలహాలు, అభిప్రాయాలు సేకరించాలన్నారు. సెప్టెంబరు 30 నాటికి మండల ప్రణాళికలు ఖరారు అయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా ప్రాధాన్య అంశాలు ఆధారంగా అక్టోబరు 15వ తేదీలోగా ప్రణాళికలు రూపొందించాలని పేర్కొన్నారు. నవంబరు 1న స్వర్ణాంధ్ర 2047 విజన్ ప్రణాళిక ఆవిష్కరణ కార్యక్రమం ఉంటుందన్నారు. కార్యాచరణ ప్రణాళికల నివేదికలను నిర్దేశిత గడువులోపు సమర్పిస్తామని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.

యార్డుకు 54,260 బస్తాల మిర్చి

కొరిటిపాడు(గుంటూరు): మార్కెట్ యార్డుకు గురువారం 54,260 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 51,876 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ. 17,200 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి 18,700 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ. 9,000 నుంచి రూ. 16,000 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 9,000 నుంచి రూ. 18,600 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,500 నుంచి రూ.12,000 వరకు ధర పలికింది. ఇంకా 23,459 బస్తాలు నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

కాణిస్టేబుళ్లు!

అవినీతికి చిరునామాగా చాలామంది కోర్టు కానిస్టేబుళ్లు మారిపోయారు. ఆఖరికి ద్విచక్ర వాహనం పోగొట్టుకున్న బాధితుడు దాన్ని ఓ కోర్టు కానిస్టేబుల్ వద్ద చూసి షాకయ్యారు. దీనిపై జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసే దుస్థితి దాపురించింది. ఓ కానిస్టేబుల్‌ను ఆరోపణల నేపథ్యంలో విధుల నుంచి పక్కన పెట్టగా.. మరొకరు కేసు లేకుండా చేయడానికి డబ్బులు డిమాండ్ చేస్తున్న తీరు కూడా వెలుగులోకి వచ్చింది.



పట్నంబజారు : గుంటూరు జిల్లా కోర్టులో కొంత మంది కానిస్టేబుళ్లు వ్యవహరిస్తున్న తీరు అనేక విమర్శలకు తావిస్తోంది. ఇటీవల కాలంలో జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన సతీష్‌కుమార్ శాఖ ప్రక్షాళన దిశగా అడుగులు వేశారు. ఎస్సైల నుంచి హోంగార్డులపై వరకు దృష్టి సారించారు. అవినీతికి పాల్పడితే ఉపేక్షించబోమని స్పష్టం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న సుమారు 35 మంది హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లను అంతర్గత బదిలీలు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. అయినప్పటికీ కొంతమంది అవినీతికి మాత్రం అడ్డూ అదుపు లేకుండా పోతోంది.

రూ.5 లక్షలు డిమాండ్

గుంటూరు వెస్ట్ పరిధిలోని ఓ స్టేషన్ పరిధిలో కానిస్టేబుల్ వ్యవహారం కూడా ఇటీవల తెరపైకి వచ్చింది. కోర్టులో పనిచేసే మహిళకు అసభ్యకర మేసేజ్‌లు చేశారని ఆరోపణలు వచ్చాయి. దీంతో ఉన్నతాధికారులు అతడిని సస్పెండ్ చేశారు. ఇతడికి సదరు కోర్టులో పనిచేసే కానిస్టేబుల్ వేరే వారితో రాయబారం పంపారు. రూ. 5 లక్షలు ఇస్తే కేస్ ప్రూవ్ కాకుండా చేస్తామని, లేకుంటే ఎఫ్ఐఆర్ నమోదు చేయిస్తామని బెదిరింపులకు దిగినట్లు సమాచారం. వెస్ట్ పరిధిలోని ఒక లూప్‌లైన్ విభాగంలో రైటర్‌గా పనిచేసి ఇక్కడ నుండి వెళ్లిపోయిన హెడ్ కానిస్టేబుల్ ఉదంతం మరొకటి. కోర్టుకు చెల్లించాల్సిన డబ్బులు బాధితుల నుంచి తీసుకుని ఆయన కట్టలేదు. ఇక్కడి నుంచి ఆయన వీఆర్‌కు వెళ్లిపోయారు. ఈ విషయాన్నీ స్టేషన్ సిబ్బంది కొందరు బాహాటంగానే చెబుతున్నారు.

అడ్డగోలు వసూళ్లు

జిల్లా కోర్టులో ప్రతి కోర్టుకు కానిస్టేబుళ్లు ఉంటారు. ప్రధాన కేసులు చూసేందుకు ఒకరు, ప్రాసెస్ వర్క్‌కు ఇంకొకరు ఉంటారు. ఏదైనా కేసులో జరిమానా విధిస్తే బాధితుల నుంచి వీరు అదనంగా వసూళ్లు చేస్తున్నారు. న్యాయమూర్తి ఎవరికైనా రూ.500 జరిమానా విధిస్తే.. వీరు మాత్రం కోర్టు ఖర్చుల నిమిత్తం అని చెప్పి రూ.5 వేల వరకు అందినకాడికి దోచుకుంటున్నారు. అన్ని కోర్టుల్లోనూ ఇలాంటి వారు కొందరు ఉంటున్నారని బాధితులు బాహాటంగానే వాపోతున్నారు. కోర్టు కానిస్టేబుళ్ల అవినీతికి సంబంధించి నేరుగా జిల్లా, రేంజ్ , రాష్ట్ర స్థాయి పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందాయి. దీంతో కొంతకాలం క్రితం ఆరోపణలు ఎదుర్కొంటున్న కొందరిపై ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించేందుకు సమాయత్తమైనట్లు సమాచారం. అంటే ఇక్కడ అవినీతి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

తప్పు చేస్తే శిక్ష తప్పదు



సిబ్బంది తప్పు చేస్తే శాఖాపరమైన శిక్ష తప్పదు. ఇప్పటికే ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిలో కొందర్ని సస్పెండ్ చేశాం. మరి కొంత మందిపై చర్యలు తీసుకున్నాం. కోర్టు కానిస్టేబుళ్ల అవినీతికి పాల్పడినట్లు తేలితే కచ్చితంగా చర్యలు తీసుకుంటాం. బాధితులు తమ ఇబ్బందిని మా దృష్టికి తీసుకొస్తే తగిన విధంగా స్పందిస్తాం. సిబ్బంది అవినీతికి పాల్పడకుండా విధులు నిర్వర్తించాలి.

– సతీష్‌కుమార్, జిల్లా ఎస్పీ

చోరీకి గురైన బైకుపై ఐదేళ్లు చక్కర్లు



గుంటూరు నగరానికి అత్యంత సమీపంలోని రూరల్ ప్రాంతంలో ఉన్న ఒక కోర్టు కానిస్టేబుల్ తీరు మరీ దారుణమని చెప్పవచ్చు. ఐదు సంవత్సరాల క్రితం ఫిరంగిపురం మండలం నుదురుపాడు గ్రామ వ్యక్తికి చెందిన ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. అప్పట్లో 2 వేల కిలోమీటర్లు మాత్రమే తిరిగింది. ఫిరంగిపురం పీఎస్‌లో బాధితుడు ఫిర్యాదు చేశారు. వాహనం దొరక్కపోవటంతో ఆశలు వదులుకున్నారు. ఇటీవల గుంటూరు కోర్టుకు వచ్చినప్పుడు ఒక కానిస్టేబుల్ వద్ద తన వాహనం కనిపించింది. తర్వాత చాసిస్ నెంబర్ పరిశీలించి బైక్ తనదేనని నిర్ధారించుకున్నారు. నేరుగా జిల్లా ఉన్నతాధికారికి ఫోన్ చేయటంతో స్పెషల్ బ్రాంచ్‌కు చెందిన ఒక సీఐను కోర్టుకు పంపారు. సదరు కానిస్టేబుల్‌ను వివరణ కోరగా.. గుంటూరు వెస్ట్ పరిధిలోని ఒక స్టేషన్ ఏరియాలో దొంగ దొరికిన సమయంలో ఈ వాహనాన్ని కూడా స్వాధీనం చేసుకున్నట్లు తేలింది. సదరు పోలీసుస్టేషన్ అధికారులు, కోర్టు కానిస్టేబుళ్లు కలిసి ఈ వాహనాన్ని కోర్టులో పనిచేసే ఒక అధికారికి గిఫ్ట్‌గా ఇచ్చారని వెల్లడైంది. ఆయన ఈ బైకును కానిస్టేబుల్‌కు ఇచ్చారు. కనీసం కేసులో పట్టుబడిన వాహనం అని కూడా చూడకుండా ఇప్పటికే సుమారు 50 వేల కిలోమీటర్లు దానిపై తిరిగేయడం గమనార్హం.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో గురువారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. 4,200 గరిష్ఠం : రూ. 7,100 మోడల్ ధర రూ. 5,800

వేద విద్యార్థులు నిరుద్యోగ భృతికి దరఖాస్తు చేసుకోవాలి

పట్నంబజారు: వేద విద్యను అభ్యసించి ఖాళీగా ఉంటున్న నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న క్రమంలో దరఖాస్తులు చేసుకోవాలని దేవదాయ ధర్మాదాయ శాఖ అధికారులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో నిరుద్యోగులుగా ఉన్న వేద విద్యార్థులకు రూ. 3 వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. వేద విద్యార్థులు వారం రోజుల లోపు దేవదాయ శాఖ సహాయ కమిషనర్, డెప్యూటీ కమిషనర్ కార్యాలయాల్లో వారు వేదం అభ్యసించిన సర్టిఫికెట్లు, వ్యక్తిగత వివరాలను తెలియజేస్తూ అర్జీలు అందించాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం 9701674999 నంబరులో సంప్రదించాలని కోరారు.

బతుకు బండి బోల్తా

- భారీగా పెరిగిన కూరగాయల ధరలు
- వర్షాల కారణంగా పంటలు దెబ్బతినడమే కారణం
- దూర ప్రాంతాల నుంచి రవాణా సమస్య
- దిగుమతి సుంకంతో వంట నూనెల ధరలకు రెక్కలు
- ప్యాకెట్‌కు రూ.25 వరకు పెరుగుదల



ఆర్టీసీ బస్టాండ్ వద్ద రైతుబజారులో కూరగాయల విక్రయం

కొరిటిపాడు(గుంటూరు): భారీ వర్షాలు, వరదలు కూరగాయల ధరలపై ప్రభావం చూపాయి. వర్షాలకు ముందున్న వాటితో పోలిస్తే ప్రస్తుతం రెట్టింపయ్యాయి. వర్షాలు, వరదల కారణంగా స్థానికంగా సాగు చేసిన కూరగాయలు, ఆకుకూరల పంటలు దెబ్బతిన్నాయి. దీనికి తోడు వరదల కారణంగా ఇతర ప్రాంతాల నుంచి జిల్లాకు రవాణా ఇబ్బందికరంగా మారింది, వాహనదారులు ఇక్కడకు రావడానికి ఇష్టపడడం లేదు. పెరిగిన డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా లేకపోవడంతో కూరగాయల ధరలు రెట్టింపయ్యాయి. ఇక రైతు బజార్లతో పోలిస్తే ప్రైవేటు మార్కెట్లలో ఎక్కువగా పలుకుతుండడంతో పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

ఆకుకూరలు కూడా అంతే...

కూరగాయలకు తోడు ఆకుకూరల ధరలు కూడా ఆకాశాన్ని అంటుతున్నాయి. పాలకూర, బచ్చలికూర, చెక్కకూర, తోటకూర, గోంగూర ఇలా ఏదైనా కట్ట రూ. 15 నుంచి రూ.20ల వరకు పలుకుతోంది. ఓ మాదిరి ఉండే కొత్తిమీర కట్ట రూ.50 పలుకుతోంది. దీంతో ఆకుకూరలు కూడా కొనే పరిస్థితి లేక ప్రజలు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. గుంటూరు జిల్లాలో నారాకోడూరు, చేబ్రోలు, తెనాలి, పొన్నూరు, తాడేపల్లి, మంగళగిరి, దుగ్గిరాల, ప్రత్తిపాడు, గుంటూరు రూరల్ తదితర మండలాల్లో సుమారు 10 వేల ఎకరాల్లో బీర, దొండ, కాకర, టమాట, వంగ, బెండ, పెద్ద చిక్కుళ్లు, గోరుచిక్కుళ్లు తదితర పంటలు సాగవుతున్నాయి. ఆగస్టు చివరి కురిసిన భారీ వర్షాలు, వరదలతో కూరగాయల పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. వరద నీరు తగ్గాక మిగిలి ఉన్న పంటలు తేరుకుంటున్నాయి.

దిగి రానంటున్న ఉల్లి ధర

ఉల్లిపాయల ధరలు కూడా రూ.50 నుంచి రూ.60కు చేరి దిగిరావడం లేదు. భారీ వర్షాలకు పంట దెబ్బతినడంతో దిగుమతులు తగ్గిపోయి పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు. మహారాష్ట్ర, కోల్‌కతా, కర్నూలు, బెంగుళూరు ప్రాంతాల నుంచి దిగుమతి కూడా తగ్గింది. జిల్లాలో కొత్త పంట వేసి అందుబాటులోకి వచ్చే వరకు ధరలు ఇలాగే కొనసాగుతాయని వ్యాపార వర్గాలు చెబుతున్నారు. వచ్చే నెల మొదటి వారంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు, నవంబర్‌లో కార్తిక మాసం ప్రారంభం కానుంది. వీటి వినియోగం మరింత పెరగనుండటంతో ఇప్పట్లో ధరలు దిగివచ్చే అవకాశం లేదని వ్యాపారులు అభిప్రాయపడుతున్నారు.

కాగుతున్న వంట నూనెలు

వీటికితోడు మార్కెట్‌లో నిత్యావసర సరుకుల ధరలు మండిపోతున్నాయి. దిగుమతి సుంకం దెబ్బకు ఆయిల్ ధరలు అమాంతం పెరిగిపోయాయి. ఈడిబుల్, క్రూడ్ ఆయిల్స్‌పై దిగుమతులపై టాక్స్ పెంపుదల ధరలపై ప్రభావం చూపింది. రిఫైన్డ్ ఆయిల్స్‌పై పన్నును 13.75 శాతం నుంచి రూ.35.75 శాతానికి, క్రూడ్ ఆయిల్‌పై కస్టమ్స్ డ్యూటీని 27.50 శాతానికి పెంచడంతో ఒక్కసారిగా ఆయిల్ ధరలు భగ్గుమన్నాయి. 850 గ్రాముల ఆయిల్ ప్యాకెట్‌పై రూ.19 నుంచి రూ.25 వరకు పెరిగి పేద, మధ్య తరగతి వర్గాల వారికి భారంగా మారింది.

రైతుబజార్‌లో ధరలు ఇలా ...

	వర్షాలకు ముందు (కిలో)	తర్వాత
టమాట	రూ.25	రూ.40
వంకాయ	రూ.18	రూ.42
కాకర	రూ.24	రూ.48
క్యాలీఫ్లవర్	రూ.18	రూ.48
దొండ	రూ.16	రూ.38
బంగాళదుంపలు	రూ.38	రూ.54

ధరలు రెట్టింపయ్యాయి



వర్షాలకు ముందు ఉన్న ధరలతో పోలిస్తే ప్రస్తుతం రెట్టింపయ్యాయి. ఇక కాలనీలు, రహదారుల వెంట ధర మరింత అధికంగా ఉంటోంది. ఏటా ఈ సీజన్‌లో ఇంత ధరలను ఎప్పుడూ చూడలేదు. వేసవి, అన్ సీజన్‌లో ఉండే ధరలు ఇప్పుడు పలుకుతున్నాయి. ఇదిలాగే కొనసాగితే పేద, మధ్య తరగతి వర్గాలకు ఇబ్బంది తప్పదు.

–బత్తుల రాజు, పాత గుంటూరు

‘స్వచ్ఛ గుంటూరు’ సాధనే లక్ష్యం



సైక్లింగ్ చేస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు, అధికారులు

నగర కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్ : జాతిపిత గాంధీ స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ స్వచ్ఛత పాటించడం ద్వారా స్వచ్ఛ గుంటూరు సాధించుకోవచ్చని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. స్వచ్ఛత హి సేవలో భాగంగా గురువారం కమిషనర్, అధికారులు క్షేత్రస్థాయి పర్యటనలకు సైకిల్‌ని వినియోగించారు. నగరపాలక సంస్థ కార్యాలయం దగ్గర మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం జీటీ రోడ్డును ప్రజారోగ్య కార్మికులతో కలసి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ప్రతి ఒక్కరూ వ్యక్తిగతంతో పాటు పరిసరాల స్వచ్ఛతను పాటించడం ద్వారా స్వచ్ఛ గుంటూరు సాధించుకోవచ్చని తెలిపారు. సైకిల్ వినియోగం ద్వారా పర్యావరణ కాలుష్యం తగ్గడంతో పాటు శారీరక ఆరోగ్యం కూడా లభిస్తుందని సూచించారు. నగర ప్రజలు స్వచ్ఛత హి సేవ కార్యక్రమాల్లో విరివిగా పాల్గొనాలని ఆయన కోరారు. కార్యక్రమంలో డెప్యూటీ కమిషనర్లు సీహెచ్.శ్రీనివాస్, టి.వెంకట కృష్ణయ్య, ఎస్ఈ శ్యాం సుందర్, ఎంహెచ్ఓలు మధుసూదన్, రామారావు, మేనేజర్ ప్రసాద్, జీఎంసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నవంబర్‌లో ఐఎంఏ రాష్ట్ర సదస్సు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఐఎంఏ నేతలు

గుంటూరు మెడికల్: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) రాష్ట్ర వార్షిక సదస్సుకు ఈ ఏడాది గుంటూరు నగరం వేదిక కానుంది. బ్రోచర్‌ను గుంటూరు జీఎంఏ హాల్లో గురువారం గుంటూరు వైద్యులు ఆవిష్కరించారు. నవంబర్ 22, 23, 24 తేదీల్లో గుంటూరు వైద్య కళాశాలలోని జింఖానా ఆడిటోరియంలో సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ గార్లపాటి నందకిశోర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ తాతా సేవకుమార్ తెలిపారు. సదస్సుకు కో చైర్మన్‌గా డాక్టర్ ఎస్. శ్రీనివాసరావు, వైస్ చైర్మన్‌గా డాక్టర్ బూసిరెడ్డి నరేందర్‌రెడ్డి, కో సెక్రటరీగా డాక్టర్ వి. మహేష్, కన్వీనర్‌గా డాక్టర్ ఎస్. ఉమాశంకర్, కోశాధికారిగా డాక్టర్ బి. సాయి కృష్ణ సమన్వయకర్తలుగా వ్యవహరిస్తారని తెలిపారు. కమిటీల చైర్మన్లుగా డాక్టర్ ఎస్. అమర్నాథ్ ,డాక్టర్ సీహెచ్. విశ్వేశ్వరరావు, డాక్టర్ ఎం. ఫణి కుమార్, డాక్టర్ జి. వేణుగోపాల్, డాక్టర్ టి. వాసు కిశోర్, డాక్టర్ ఎం.జగదీష్ కుమార్, డాక్టర్ కె. కృష్ణ ప్రసాద్, డాక్టర్ రమణ యశస్వి, డాక్టర్ వి.వి రామ కుమార్, డాక్టర్ బి.బి అప్పారావు, మహిళా విభాగానికి డాక్టర్ పి.ఎస్.ఎస్. హరిత వివిధ కమిటీలకు సంధానకర్తలుగా వ్యవహరిస్తారని పేర్కొన్నారు. సదస్సుకు అతిథులుగా ఐఎంఏ జాతీయ అధ్యక్షులు డాక్టర్ ఆర్.వి.అశోకన్, కార్యదర్శి, డాక్టర్ అనిల్ కుమార్ జే నాయక్ ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎం.జె.సి. నాయుడు, కార్యదర్శి డాక్టర్ పి.ఫణిధర్ , ఐఎంఏ మాజీ జాతీయ అధ్యక్షులు డాక్టర్ జి. సమరం తదితరులు పాల్గొంటారని వెల్లడించారు. రెండు తెలుగు రాష్ట్రాలలోని వైద్యులు అధిక సంఖ్యలో ఈ సదస్సుకు హాజరుకావాలని డాక్టర్ నందకిశోర్, డాక్టర్ సేవ కుమార్ కోరారు. మరిన్ని వివరాలకు 7569702090 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

పొంతనలేని ప్రశ్నలతో విచారణ

విజయవాడ డెప్యూటీ మేయర్ భర్త అవుతు శ్రీనివాస్‌రెడ్డిని విచారించిన మంగళగిరి పోలీసులు



శ్రీనివాస్‌రెడ్డిని విచారణకు తీసుకు వస్తున్న పోలీసులు

మంగళగిరి: టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో అక్రమంగా అరెస్ట్ అయి జైలులో ఉన్న విజయవాడ డెప్యూటీ మేయర్ భర్త అవుతు శ్రీనివాస్‌రెడ్డిని గురువారం మంగళగిరి రూరల్ స్టేషన్‌కు తరలించి విచారించారు. పోలీసులు శ్రీనివాస్ రెడ్డిని సంఘటనతో సంబంధం లేని ప్రశ్నలతో విచారించి , వైఎస్సార్ సీపీ పెద్దల పేర్లు చెప్పాలని ఒత్తిడి చేసినట్లు తెలిసింది. పోలీసుల విచారణకు సహకరించిన శ్రీనివాస్‌రెడ్డిని తిరిగి జైలుకు తరలించారు. ఉదయం 8 గంటలకు విచారణ ప్రారంభించిన అధికారులు 12 గంటకు కోర్టులో హాజరుపరచి సాయంత్రం 4 గంటలకు గుంటూరు కారాగారానికి తరలించారు.

అనుమతులు లేకుండా నడిరోడ్డుపై జన్మదిన వేడుకలు

- అరండల్‌పేట స్టేషన్‌కు కూతవేటు దూరంలో నిర్వహణ
- నిలిచిపోయిన ట్రాఫిక్
- అధిక సంఖ్యలో పాల్గొన్న యువత
- ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలీస్ స్టేషన్‌కు తరలింపు

లక్ష్మీపురం: గుంటూరు నగరంలోని అరండల్‌పేట పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో శారదా కాలనీ, రత్నపురి కాలనీ ప్రాంతాలలో ఇద్దరు యువకులు జన్మదినం ఒకే రోజు కావడంతో వేడుకలను నడి రోడ్డుపై నిర్వహించడంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. అనుమతి లేకుండా జరుపుకుంటున్న నేపథ్యంలో పోలీస్ ఉన్నతాధికారులకు సమాచారం తెలియడంతో అరండల్‌పేట స్టేషన్‌కు తరలించిన ఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అరండల్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో శారదా కాలనీ 1వ లైన్‌లో ఒక యువకుడు, మల్లికార్జునపేటలో మరో యువకుడి ఇద్దరి జన్మదినం ఒకే రోజు కావడంతో రెండు ప్రాంతాలలో రోడ్డుకు అడ్డంగా వారి సన్నిహితులు, అనుయాయులతో జన్మదిన వేడుకల్ని నిర్వహించారు. డీజేలతో పాటు నడిరోడ్డుపై ట్రాఫిక్‌కు పూర్తి అంతరాయం కలిగించడంతో నివాసితులు ఇబ్బంది పడాల్సి వచ్చింది. దీంతో పోలీస్ ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. వారి ఆదేశాల మేరకు అరండల్‌పేట సీఐ, సిబ్బందితో హుటాహుటిన సంబంధిత ప్రాంతానికి చేరుకుని ట్రాఫిక్‌ను నియంత్రించారు. అనుమతులు లేకుండా జన్మదిన వేడుకల్ని జరుపుకుంటున్న వారిలో కొంత మంది యువకుల్ని వ్యాన్‌లో ఎక్కించి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

కొనసాగుతున్న కాంట్రాక్టు స్టాఫ్‌నర్సుల నిరసన



- జీజీహెచ్‌లో కళ్లు, చెవులు, నోరు మూసుకుని వినూత్న నిరసన
- 15వ రోజుకు చేరుకున్న నిరసన

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు స్టాఫ్‌నర్సులు గురువారం చెవులు, కళ్లు, నోరు మూసుకుని వినూత్న రీతిలో నిరసన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తమ సమస్యలను పట్టించుకోకుండా కళ్లు మూసుకుంటుందని, తమ సమస్యలపై నోరు మెదపడం లేదని, కనీసం వినడం లేదంటూ వాపోతూ వినూత్నంగా నిరసన తెలిపారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట విధులు బహిష్కరించి నల్లబ్యాడ్జీలు ధరించి తమకు న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. ప్రభుత్వం తమను రెగ్యులర్ చేసేవరకు నిరసన కార్యక్రమాలు కొనసాగుతాయని గుంటూరు జీజీహెచ్ కాంట్రాక్ట్ స్టాఫ్‌నర్సులు తెలిపారు. రెగ్యులర్ స్టాఫ్‌నర్సు ఉద్యోగాల నోటిఫికేషన్ 15 ఏళ్లుగా ప్రభుత్వం ఇవ్వకపోవడం వల్ల కాంట్రాక్ట్ నర్సింగ్ సిబ్బంది తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని వాపోయారు. తమ డిమాండ్లు ప్రభుత్వం నెరవేర్చకపోతే నిరసనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్ నర్సెస్ స్ట్రగుల్ కమిటీ రాష్ట్ర నాయకులు పి.మనీష, స్వచ్ఛంద ప్రసాద్, జిల్లా అధ్యక్షురాలు రేణుక, సెక్రటరీ శివమ్మ, కోశాధికారి విజయ్ కుమార్, ఉపాధ్యక్షురాలు కోటేశ్వరి, సౌజన్య, కరుణ, జాయింట్ సెక్రటరీలు హైమావతి, సంధ్యా, మేరీ, రమాదేవి, సభ్యులు కుసుమ కుమారి, సుధారాణి, బాలసుందరి, అంజమ్మ, సురేష్, సర్దార్, సుభాని తదితరులు పాల్గొన్నారు.

మహిళతో అనుచిత ప్రవర్తన

–పోలీసులకు ఫిర్యాదు

మంగళగిరి: ఫిట్‌నెస్ సెంటర్‌లో వ్యాయామం చేసేందుకు వెళ్లిన మహిళతో యువకుడు అసభ్యంగా ప్రవర్తించిన ఘటన చోటు చేసుకుంది. గురువారం మంగళగిరి పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని ఆటోనగర్ టీవీఎస్ షోరూమ్‌పైన భవనంలో కొడాలి పవన్‌కుమార్, సైదా నాయక్, హుస్సేన్‌లు ఫిట్‌నెస్ సెంటర్ నిర్వహిస్తుంటారు. నగర పరిధిలోని యర్రబాలేనికి చెందిన వాసల్య ఆరోగ్యం బాగాలేకపోవడంతో డాక్టర్ సూచన మేరకు వ్యాయామం చేసేందుకు ఈ ఫిట్‌నెస్ సెంటర్‌లో చేరింది. వ్యాయామం చేయించే క్రమంలో కొడాలి పవన్‌కుమార్ వాసల్యతో కొద్ది రోజులుగా అసభ్యంగా ప్రవరిస్తున్నాడు. పవన్ కుమార్ వేధింపులు అధికం కావడంతో ఆమె గురువారం మంగళగిరి నార్త్ జోన్ డీఎస్పీ మురళీకృష్ణకు ఫిర్యాదు చేయగా ఆయన పట్టణ స్టేషన్‌కు కేసు బదిలీ చేశారు. కేసు నమోదు చేసిన సీఐ వినోద్‌కుమార్ దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఈస్ట్ సబ్ డివిజన్ డీఎస్పీగా షేక్ అబ్దుల్ అజీజ్



బాధ్యతలు స్వీకరించిన షేక్ అబ్దుల్ అజీజ్

పట్నంబజారు: గుంటూరు ఈస్ట్ సబ్‌డివిజన్ డీఎస్పీగా షేక్ అబ్దుల్ అజీజ్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. 1991 బ్యాచ్‌కు చెందిన ఆయన ఉమ్మడి గుంటూరు జిల్లాలో 19 పోలీసు స్టేషన్‌లలో ఎస్ఐగా పనిచేశారు. 2009లో ఆయనకు సీఐగా పదోన్నతి లభించింది. నెల్లూరు, ప్రకాశం, గుంటూరు జిల్లాల పరిధిలో పలు ప్రాంతాల్లో ఆయన సీఐగా విధులు నిర్వర్తించారు. 2012లో ఆయనకు డీఎస్పీగా పదోన్నతి దక్కగా, మచిలీపట్నం, గుంటూరు రూరల్ పోలీసుస్టేషన్‌లలో బాధ్యతలు నిర్వర్తించి, గుంతకల్లు రైల్వేస్టేషన్ డీఎస్పీగా ఉన్న క్రమంలో సాధారణ బదిలీల్లో భాగంగా గుంటూరు ఈస్ట్ సబ్‌డివిజన్ డీఎస్పీగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

సీనియర్ ఫార్మసీ ఆఫీసర్లుగా పదోన్నతి



ఆర్‌డీ కార్యాలయంలో ఫార్మాసిస్ట్‌లకు పదోన్నతి ఉత్తర్వులు అందజేస్తున్న ఆర్‌డీ సుచిత్ర

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు (ఆర్డీ) కార్యాలయం పరిధిలో పనిచేస్తున్న గ్రేడ్ -2 ఫార్మాసిస్టులకు ఆరుగురికి పదోన్నతి కౌన్సెలింగ్ నిర్వహించి సీనియర్ ఫార్మసీ ఆఫీసర్లుగా ప్రమోషన్ ఉత్తర్వులను ఆర్డీ డాక్టర్ కె.సుచిత్ర గురువారం అందజేశారు. నెల్లూరు జిల్లాలో పనిచేస్తున్న ఆర్.మణికి నెల్లూరు జిల్లాలోని డీఎస్ఆర్ గవర్నమెంట్ కాలేజీలో, మంగళగిరిలో పనిచేస్తున్న ఆర్.అన్నమ్మకు గుంటూరు జీజీహెచ్‌లో, నెల్లూరులో పనిచేస్తున్న ఎం.కృష్ణప్రియకు నెల్లూరు గవర్నమెంట్ కాలేజీలో సీనియర్ ఆఫీసర్స్‌గా ప్రమోషన్ ఇచ్చారు. గుంటూరు జిల్లా ముట్లూరులో పనిచేస్తున్న షేక్ కరీముల్లాకు గుంటూరు మెడికల్ కాలేజీలో, మంగళగిరిలో పనిచేస్తున్న ఎస్.కవితకు ఒంగోలు గవర్నమెంట్ హాస్పిటల్‌లో, బాపట్ల జిల్లా మోపర్రులో పనిచేస్తున్న హుల్డా రాణికి మార్కాపురం గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్‌లో ఫార్మసీ ఆఫీసర్‌గా ప్రమోషన్ ఇచ్చారు. కౌన్సెలింగ్ ప్రక్రియలో ఆర్డీతోపాటు డెప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి, ఆఫీస్ సూపరింటెండెంట్లు షేక్ నాగూర్ షరీఫ్, గోపవరపు స్టాన్లీ రాజ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ బి.శ్యామ్ పాల్గొన్నారు.

ఇల్లు కూలి వృద్ధురాలి మృతి



సూరమ్మ మృతదేహం

పట్నంబజారు: ఇల్లు కూలి వృద్ధురాలు మృతి చెందిన ఘటనపై కేసు నమోదైంది. లాలాపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్.అగ్రహారం ప్రధాన రహదారిలో అడపా సూరమ్మ (83), కుమారుడు శ్రీనివాసరావు, కుటుంబ సభ్యులు 60 సంవత్సరాల క్రితం నిర్మించిన పెంకుటిల్లులో నివాసం ఉంటున్నారు. గురువారం ప్రమాదవశాత్తు కూలింది. ఇంటి శిథిలాల కింద సూరమ్మ, శ్రీనివాసరావు కిందపడ్డారు. స్థానికులు వెంటనే 108 సహాయంతో గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సూరమ్మ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. శ్రీనివాసరావుకు గాయాలయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యం



స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యంతో సీఎస్ డీటీ పద్మజ

ప్రత్తిపాడు: అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని పౌరసరఫరాల శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్న ఘటన మండలంలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంట సమీపంలోని ఓ పత్తి గోడౌన్‌లో అక్రమంగా రేషన్ బియ్యంను దాచి ఉంచారన్న సమాచారం సివిల్ సప్లయిస్ అధికారులకు అందింది. దీంతో గురువారం సీఎస్ డీటీ పద్మజ స్థానిక అధికారులతో కలిసి గోడౌన్‌లో తనిఖీలు నిర్వహించారు. 120 బ్యాగుల్లో నిల్వ చేసిన 60 క్వింటాళ్ల రేషన్ బియ్యం నిల్వలను గుర్తించారు. దీంతో రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు గోడౌన్‌ను అద్దెకు తీసుకున్న గుంటూరుకు చెందిన కె. జనార్దన్‌పై 6–ఏ కేసుతో పాటు క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు సీఎస్ డీటీ తెలిపారు. అక్రమంగా రేషన్ బియ్యాన్ని నిల్వ చేసినా, విక్రయించినా, తరలించిన ఉపేక్షించబోమని పద్మజ హెచ్చరించారు.

రైలు నుంచి పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

తెనాలి రూరల్: రైలు నుంచి పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కొలకలూరు, దుగ్గిరాల స్టేషన్ల మధ్య పట్టాల వెంబడి మృతదేహం ఉందన్న సమాచారంతో తెనాలి జీఆర్పీ పోలీసులు ఘటనాస్థలాన్ని గురువారం పరిశీలించారు. సుమారు 30 నుంచి 32 ఏళ్ల మధ్య వయసున్న వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు. ముఖం గుర్తు పట్టలేనంతగా ఛిద్రమైంది. రైలులో ప్రయాణం చేస్తూ ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. మృతుడు సిమెంటు రంగు ప్యాంటు, బిస్కెట్ రంగు టీ షర్టు ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ వెంకటాద్రి తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 9440627554 నంబరులో సంప్రదించాలని సూచించారు.

పీఆర్కేకే మళ్లీ పల్నాడు సారథ్యం

ఆనందపడుతున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు, అభిమానులు



వైఎస్ జగన్‌తో పీఆర్కే

మాచర్ల: వైఎస్సార్ కుటుంబానికి అత్యంత విధేయుడిగా వ్యవహరిస్తూ ఆ కుటుంబాన్ని నమ్ముకొని కష్టకాలంలో సైతం మాజీ సీఎం జగన్ వెంట సుదీర్ఘకాలం నడిచిన పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సేవలకు గుర్తింపుగా మరోసారి పల్నాడు జిల్లా అధ్యక్షుడిగా ఆయన్ను నియమిస్తూ పార్టీ అధ్యక్షులు వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. మహానేత డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి 2009లో ఎమ్మెల్యే అభ్యర్థిగా కాంగ్రెస్ తరపున పీఆర్కేను ఎంపిక చేశారు. అప్పటి నుంచి ఆయన ఆ కుటుంబాన్ని ఇప్పటి వరకు మరచిపోకుండా వారి వెంట నడుస్తూనే ఉన్నారు. తాను కష్టాలు ఎదుర్కొంటూ, ఇబ్బందులు పడుతున్నా ఏనాడూ పార్టీకి వ్యతిరేకంగా పని చేయాలని గానీ, మరో ఆలోచన గానీ చేయకుండా ముందుకు నడిచి వైఎస్సార్ కుటుంబం వెంటే నా బాట అంటూ చాటి చెప్పారు. అందులో భాగంగా 2012లో జగన్ వెంట నడిచి అసెంబ్లీలో అనర్హత వేటుకు గురై ఉప ఎన్నికలలో వైఎస్సార్ సీపీ తరపున పోటీ చేసి గెలుపొందారు. 2014, 2019లో పోటీ చేసి గెలిచారు. ఈ విధంగా దశాబ్దాల పాటు వైఎస్సార్ కుటుంబాన్ని అంటిపెట్టుకొని మంత్రి పదవి రాకపోయినా సీనియర్‌గా ఉండి కూడా అసంతృప్తి చెందకుండా పార్టీ కోసం కృషి చేశారు. అదే ఆయనను గుర్తించిన పార్టీ ప్రభుత్వ విప్‌గా నియమించింది. ఆ తరువాత పల్నాడు జిల్లా ఏర్పడిన వ్పటి నుంచి ఆయనను అధ్యక్షులుగా ఎంపిక చేసి కొనసాగిస్తున్నారు. అదే నేపథ్యంలో తిరిగి బుధవారం తాడేపల్లిలో మాజీ సీఎం జగన్ పల్నాడు ఇన్‌చార్జిలతో భేటీ అయిన అనంతరం తిరిగి పల్నాడు జిల్లా అధ్యక్షులుగా పీఆర్కేను ఎంపిక చేయటంతో వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో మరోసారి జోష్ నెలకొంది. పల్నాటి ప్రాంతంలో పార్టీ అభివృద్ధికి అనేక సంవత్సరాలుగా కృషి చేస్తూ జిల్లా అధ్యక్షుడిగా ఎదిగిన నాటి నుంచి ఇప్పటి వరకు ఎన్ని ఇబ్బందులు ఎదురవుతున్నా ఏమాత్రం పట్టించుకోకుండా ముందుకు సాగుతున్న పీఆర్కేకు మళ్లీ జిల్లా రథ సారథ్యం పార్టీ అప్పగించడంపై వైఎస్సార్ సీపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.